హైదరాబాద్ వార్త





చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అంగన్వాడీల పాత్ర కీలకం: కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్, మార్చి 22,ప్రభాతవార్త: ఆరోగ్యవంతమైన సమాజ ఏర్పాటులో అంగన్వాడీ టీచర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఈమేరకు శుక్రవారం మారేడ్‌పల్లిలోని భగవతి రెసిడెన్సీలో మహిళాభివృద్ధి ,శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, పోషణ్ ఫక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు అంగన్వాడీ టీచర్లు కీలక భూమిక పోషిస్తున్నారని అన్నారు. కేంద్రం, రాష్ట్రాల్లో అమలవుతున్న చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని గర్భిణీలు, పిల్లలు పోషక విలువలు ఉన్న ఆహారం,మిల్లెట్స్ తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా గర్భిణీలకు శ్రీమంతం, 6నెలల పిల్లలకు అన్నప్రాసన చేశారు. డిడబ్ల్యూవో అక్కేశ్వర్‌రావు, సిడిపివో సునంద, కౌన్సిలర్ అడ్వకేట్ శైలజ, భవాని, అగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# చిట్టి తల్లిని చిదిమేసిన కారు

### కారు కింద పడి చిన్నారి మృతి

మెహిదీపట్నం, మార్చి 22, ప్రభాతవార్త : కారు కింద పడి చిన్నారి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రామిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన కరిగల్ల శీను వసుంధర దంపతులు అత్తాపూర్ అక్బర్‌హిల్స్ లోని సుల్తాన్ ప్యాలెస్‌లో గత ఐదు సంవత్సరాలుగా నివాసం ఉంటూ వాచ్‌మెన్‌గా జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఎనిమిది నెలల చిన్నారి రుక్మిణి ఉంది. శుక్రవారం ఉదయం పదిగంటల ప్రాంతంలో చిన్నారి వాకర్‌లో ఆడుకుంటుండగా పక్కనే ఉన్నటువంటి కారును (ఎంహెచ్ 03సిఎస్ 8042) అయాజ్ అహ్మద్ అనే వ్యక్తి వెనకకు తీస్తూండగా చిన్నారి రుక్మిణి కారుకి తగిలి కింద పడిపోయింది. ఇది గమనించిన కారు డ్రైవర్ పక్కనే ఉన్నటువంటి చిన్నారి తల్లిదండ్రులను పిలిచాడు. వెంటనే చిన్నారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తూన్నారు.

## హోలీ రోజు వైన్స్ బంద్

హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: హోలీ పండుగ సందర్భంగా నగరంలో పోలీసులు ఆంక్షలు విధించారు. ఈనెల 25న ఉదయం 6 గంటల నుంచి 26 ఉదయం 6 గంటల వరకు మద్యం షాపులు మూసివేస్తున్నట్లు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. శాంతి భద్రతలకు భంగం కలుగకుండా పండుగ సందర్భంగా షాపులు మూసివేయాలని వైన్స్ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మందు తాగి బహిరంగ ప్రదేశాల్లో గొడవలను సృష్టిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోలీ సందర్భంగా ప్రతి ఏటా సీటీలో వైన్స్ షాపులు ఓపెన్ చేసుకునేందుకు పోలీసులు అనుమతి ఇవ్వక పోవడం తెలిసిందే. మద్యం షాపులను మూసివేయాల్సిందిగా యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. హోలీ వేడుకల్లో పాల్గొనేవారు ఇతరులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని, నగరంలో తిరిగే వాహనదారులపై రంగులు చల్లరాదన్నారు. వాహనాలపై పబ్లిక్ రోడ్స్‌లో గుంపులుగా తిరుగుతూ న్యూసెన్స్ చేయొద్దని సూచించారు.

## కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా
### బిజెపి కార్యాలయం ఎదుట నిరసన



డాక్టర్ దిడ్డి సుధాకర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

సైఫాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడి అరెస్టు చేయడం దుర్మార్గం, చట్టవిరుద్ధమని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు బిజెపి చేతిలో ప్రతి పక్షనేతల అణిచివేతకు ప్రధాన సాధనాలుగా మారాయని ఆయన విమర్శించారు. కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బిజెపి ఆదేశాలతోనే ఈడి కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బిజెపికి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్ర కార్యాలయంలోకి చొచ్చుకుని వెళ్ళేందుకు ప్రయత్నించారు. అక్కడ తొపులాట, ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో వారిని పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. సుధాకర్ మాట్లాడుతూ భారతదేశంలో రోజురోజుకు ఆప్‌కు పెరిగిపోతున్న బలాన్ని చూసి ప్రధాని నరేంద్రమోదీ ఓడిపోతారన్న భయంతోనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారని ఆరోపించారు. ఆప్ నాయకులు బుర్ర రాముగౌడ్, అన్సారీ, ఎంఎ మజీద్ పాల్గొన్నారు.

# అంబులెన్స్‌కే ఆపద

## గుంతలతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్

## కుయ్.. కుయ్ రాస్తానై!

బోడుప్పల్‌కు చెందిన ఒక గర్భిణి గురువారం మధ్యాహ్నం పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108 అంబులెన్స్‌లో తీసుకొని ఆస్పత్రికి బయలుదేరారు. అప్పటికే రోడ్లపై భారీగా ట్రాఫిక్ రద్దీ ఉండటం, చాలాచోట్ల రహదారులపై గుంతలు ఉండడంతో వాహనాల వేగం నెమ్మదించింది. వాస్తవానికి 15 నిమిషాల్లో ఆస్పత్రికి చేరుకోవాల్సిన వాహనం అరగంటకు పైగా ట్రాఫిక్‌లోనే చిక్కుకుంది. అప్పటికే నొప్పులతో బాధపడుతున్న గర్భిణి అంబులెన్స్‌లోనే బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను ఆస్పత్రిలో చేర్పించారు.

ఇలా ఒక్క గర్భిణినే కాదు..108, ఇతర అంబులెన్స్‌లలో వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్తున్న బాధితులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీనే ఇందుకు కారణమవుతోంది. ఓఆర్‌ఆర్ సహా శివారు జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగిన పుడు క్షతగాత్రులను, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ బాధితులను అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు చేర్చే క్రమంలో అంబులెన్స్ లకు ట్రాఫిక్ అడ్డంకిగా మారింది. అంబులెన్స్‌లు సకాలంలో ఆస్పత్రులకు చేరుకోకపోవడంతో గర్భిణులు ఆయా వాహనాల్లోనే ప్రసవిస్తుండగా.. అనారోగ్య బాధితులు మృత్యువాతపడుతున్నారు.



- నగర ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్న ఎమర్జెన్సీ వెహికల్స్
- ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వాన్నంగా మారిన రహదారులు
- 108, ఇతర అంబులెన్స్‌లకు దొరకని దారి
- బాధితులను ఆస్పత్రులకు తరలించడంలో జాప్యం

హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: నగరంలో ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బ తిన్నాయి. రోడ్లపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఫలితంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పీక్ అవర్స్‌గా పేర్కొనే ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు..మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు..సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ సమయంలో నగరంలోకి వచ్చే అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. సకాలంలో ఆస్పత్రికి చేరుకోకపోవడంతో పరిస్థితి విషమించి బాధితుల ప్రాణాల మీదకు వస్తోంది. వైద్య పరిభాషలో ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటను 'గోల్డెన్ అవర్'గా పేర్కొంటారు. క్షతగాత్రులను ఈ సమయంలోపు ఆస్పత్రులకు తరలిస్తే వారు ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. కానీ తరలింపులో జరుగుతున్న జాప్యంతో మరణాలు సంభవిస్తున్నాయి.

వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో పాటు నగరంలో వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంటోంది.వరంగల్ జాతీయ రహదారిలోని మేడిపల్లి, బోడుప్పల్, ఉప్పల్ వరకు, అంబర్ పేట శ్రీరమణ థియేటర్ చౌరాస్తా, [illegible] అంబర్‌పేట చే నెంబర్, గోల్నాక తదితర పలు రహదారుల్లో రోడ్డు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇక ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, ఉప్పల్ చౌరస్తా, పంజా గుట్ట, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, కోఠి, సికింద్రా బాద్, ప్యారడైజ్, ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ రోడ్డు, హిమాయత్‌నగర్, లిబర్టీ, మెహి దీపట్నం, గచ్చిబౌలి, మాదాపూర్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు తదితర ప్రాంతాల్లో పీక్ అవర్స్‌లో వాహనాలన్నీ ఒకేసారి రోడ్లపైకి వస్తుండడంతో ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ అవుతోంది. అంతేకాకుండా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లకు దారి ఇవ్వాలనే సామాజిక స్పృహ చాలా మంది వాహనదారుల్లో ఇప్పటికీ కొంత లేకపోవడంతోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఫలితంగా 15 నిమిషాల్లో ఆస్పత్రికి చేరుకోవాల్సిన అంబులెన్స్‌లు 30 నిమిషాలకు పైగా రోడ్లపైనే నిలిచిపోతున్నాయి. గ్రేటర్ పరిధిలోని ఏడు జిల్లాల పరిధిలో దాదాపు 7,200 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. సుమారు 150 కిలోమీటర్ల పొడవైన ఔటర్‌రింగ్ రోడ్డుతో పాటు పలు రాష్ట్రీయ జాతీయ రహదారులు దీనికి అనుకొని ఉన్నాయి. ఈ రహదారులపై ఏటా రెండు వేలకుపైగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో 200–300 మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారు. అనేక మంది వికలాంగులుగా మారుతున్నారు. ప్రధాన నగరంలో ప్రతి 5 కిలోమీటర్లకు ఒక 108 అంబులెన్స్ ఉండగా.. అదే శివార్లలో ప్రతి 25–30 కిలో మీటర్లకు ఒకటి ఉంది. ఔటర్‌పై ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అంబులెన్స్ ఘటనాస్థలికి చేరుకోవా లంటే కనీసం గంటకు పైగా పడు తోంది. ఘటనా స్థలానికి చేరుకున్న తర్వాత క్షతగాత్రులను ఉస్మానియా, నిమ్స్, గాంధీ ఆస్పత్రులకు తరలించ డానికి మరో గంటకు పైగా పడుతోంది. ఇలా ఔటర్ నుంచి ఆస్పత్రులకు బాధితులను తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వరంగల్, జనగాం, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల నుంచి వచ్చే ఇతర అంబులెన్స్‌లకు సిటీలో ఇబ్బందులు తప్పడంలేదు. ప్రయాణ దూరానికి రోడ్లపై నిలిచి పోయిన ట్రాఫిక్ తోడవుతుండటంతో అంబులెన్స్‌లు సకాలంలో ఆస్పత్రులకు చేరుకోవడం లేదు.

# గ్రేటర్ పట్టుకోసం హస్తం ఆరాటం

### ఎంపీ స్థానాలపై కాంగ్రెస్ ఫోకస్ ● కాంగ్రెస్‌లో చేరనున్న నగర మేయర్ విజయలక్ష్మీ?

హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: గ్రేటర్ పరిధిలోని మూడు ఎంపి సీట్లను ఎట్టి పరిస్థితుల్లో గెలవాలని కాంగ్రెస్ గట్టిగా ప్రయత్నాలు చేస్తోంది. అందుకు తగ్గట్లే ఆపరేషన్ గ్రేటర్ పేరుతో ముందుకు వెళ్తోంది హస్తం పార్టీ, అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాల్లో మెరుగైన ఫలితాలు సాధించినప్పటికీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం ఆశించిన సీట్లు రాబట్టలేకపోయింది. దీంతో గ్రేటర్ గురి పెట్టింది కాంగ్రెస్ నేతలు. మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, చేవెళ్ల స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఈ మూడు సీట్లలోనూ బిఆర్‌ఎస్ నుంచి చేరిన సునితా మహేందర్‌రెడ్డి, దానం నాగేందర్, రజింత్ రెడ్డిలకు టికెట్లు కేటాయించింది. ఆర్థిక బలంతో పాటు ప్రజాబలం ఉన్నవారిని పార్టీలో చేర్చు కుని, మూడు ఎంపిలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవాలని చూస్తోంది. ఇందులో భాగంగా గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలతోనూ మంతనాలు జరుపుతున్నారు. ఇప్పటికే డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి సహా 10 మందికి పైగా కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరగా మరో 13 మంది హస్తం గూటికి చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది.



ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మేయర్ విజయలక్ష్మీ (పాతచిత్రం)

**మేయర్ విజయలక్ష్మీతో కాంగ్రెస్ ఇంచార్జి భేటీ..**

తాజాగా గ్రేటర్ మేయర్, కార్పొరేటర్లపై ఫోకస్ పెట్టారు. కార్పొరేటర్లే కాదు జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మీని చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది కాంగ్రెస్. మారిని రాజకీయ సమీకరణాల్లో భాగంగా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు సమాచారం. మేయర్ గద్వాల విజయలక్ష్మీతో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ భేటీ అయ్యారు. బంజారాహిల్స్‌లోని కేకే నివాసానికి ఆమెతో పాలు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి వెళ్లారు. దాదాపు 40 నిమిషాల పాటు జరిగిన రాజకీయ చర్చల్లో విజయలక్ష్మీ పాల్గొన్నారు.

మేయర్ హస్తం గూటికి చేరుతారనే దానిపై ఇంకా క్లారిటీ రావాల్సింది. కాంగ్రెస్‌లోనికి రావాలని తనను దీపదాస్ మున్షీ ఆహ్వానించారని మేయర్ తెలిపారు. కార్యకర్తలతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటానన్నారు. వారి అభిప్రాయం మేరకు నిర్ణయం ఉంటుంది, రెండుసార్లు తనని గెలిపించిన కార్యకర్తలకు చెప్పకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోనన్నారు.మరోవైపు కాంగ్రెస్ నేతలు మాత్రం పార్లమెంటు ఎన్నికల ముందే గ్రేటర్‌లో బిగ్ న్యూస్ చూస్తారని కాంగ్రెస్ నాయకులు చెబుతుండడం గమనార్హం

## ముస్లీం సోదరుల ఇఫ్తార్ విందు



పాతబస్తీలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

## ఐదో అంతస్థు నుంచి జారి పడి కాంట్రాక్టర్ కొడుకు మృతి

### మరో కార్మికుడికి గాయాలు

చార్మినార్, మార్చి 22 ప్రభాతవార్త : భవనం ఐదో అంతస్థు నుంచి ప్రమాదవశాత్తు కిందికి జారి పడి కాంట్రాక్టర్ కుమారుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం పాత బస్తీ బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం. మహబూబ్‌నగర్ జిల్లాకు

మిగతా సిటీ 3వ పేజీలో

# దేవాలయ భూమికి కబ్జా చెర నుంచి విముక్తి

### అధికారుల పనితీరును అభినందిస్తున్న స్థానికులు ■ రూ.10.కోట్ల భూమిని కాపాడిన అధికారులు



గండిపేట మండలం నెక్‌నాంపూర్ సర్వే నెంబర్ 116లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు

నార్సింగి, మార్చి 22 ప్రభాతవార్త : గండిపేట మండల రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు కలిసి శుక్రవారం నెక్‌నాంపూర్ గ్రామంలోని ఒక ఎకరం దేవాదాయ శాఖకు సంబంధించిన భూమిని కబ్జాదారుల చెర నుంచి విడిపించారు. అక్కడ కబ్జాదారులు చేపట్టిన నిర్మాణాలను జేసీబీ సహాయంతో భూమట్టం చేశారు. అధికారుల కూల్చివేతల కారణంగా రూ.10 కోట్ల విలువ చేసే దేవాలయానికి చెందిన భూమి తిరిగి దేవాలయానికే మిగిలిపోయింది. అధికారుల తీరు పట్ల స్థానికులు సంతోషంను వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు అభినందనలు తెలుపుతున్నారు. నెక్‌నాంపూర్ సర్వే నెంబర్ 116.లో 3.ఎకరాల స్థలం గణేష్ దేవాలయంకు ఉంది. ఇందులో సుమారు ఎకరం భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి, ఈ స్థలం తమదని పేర్కొంటూ నిర్మాణాలు కూడా చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు, వివిధ పత్రి కలలో వచ్చిన వార్తా కథనాలకు స్పందించిన రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు శుక్రవారం కూల్చి వేయించారు. ఇలాంటి నిజాయితీ గల అధికారులుంటేనే ప్రభుత్వ భూములు కాపాడబడుతాయని, అధికారుల పనితీరును స్థానికులు ప్రశంసిస్తున్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన తలసాని అనుచరుడు తొలుపునూరి కృష్ణగౌడ్

### కండువా కప్పి ఆహ్వానించిన మాజీఎంపి వి.హనుమంతరావు



విహెచ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన కృష్ణగౌడ్, ఆయన అనుచరులు

హైదరాబాద్, మార్చి 22,ప్రభాతవార్త: బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తొలుపునూరి కృష్ణగౌడ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అంబర్ పేట్ నియోజకవర్గం బిఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన కృష్ణగౌడ్ శుక్రవారం డిడికాలనీలోని మాజీ ఎంపి వి.హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కృష్ణగౌడ్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ప్రధాన అనుచరుడిగా ఉండేవారు. ఈసందర్భంగా విహెచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఉంటుందని తెలపారు. కాంగ్రెస్‌పార్టీ అప్పగించిన బాధ్యతలను విజయ వంతంగా నిర్వహిస్తానని కృష్ణగౌడ్ తెలిపారు. బిఆర్‌ఎస్ పార్టీలో నాయకులకు, కార్యకర్తలు గౌరవం లేదని అందుకే కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో దిలీప్, నరేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి.జ్ఞానేశ్వర్‌గౌడన, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, గరిగంటి రమేష్, శంభుల శ్రీకాం త్‌గౌడ్, నారాయణస్వామి, గడ్డం లక్ష్మణ్, దిడ్డిరాంబాబు, రామ్మోహన్ పాల్గొన్నారు.

## నీటివనరులు అక్రమాలకు గురికాకుండా చర్యలు

- ➢ అన్ని చెరువుల వద్ద బౌండరీల మ్యాప్‌ను ప్రదర్శించాలి
- ➢ లేక్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేసి చైతన్యపరచాలి
- ➢ అధికారులకు జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుడుతున్న కమిషనర్ రోనాల్డ్‌రోస్, ఈవిడిఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త: నగరంలో నీటి వనరులు అక్రమణలకు గురికాకుండా పరిరక్షించడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం బుద్ధభవన్ ఈవిడిఎం కార్యాలయం సమావేశమందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి పరిధిలోగల అన్నిచెరువుల వద్ద ఎఫ్‌ఎటిఎల్, బఫర్‌జోన్ బౌండరీలకు సంబంధించిన మ్యాప్‌లను చెరువుల వద్ద ప్రదర్శించాలని సూచించారు. లేక్‌ప్రొటెక్షణ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈకమిటీ సభ్యులచే వాట్సాప్‌గ్రూప్‌లను చైతన్యపరచాలన్నారు. అలాగే యాప్ పెట్టి అందులో ఇన్స్‌పెక్షన్ రిపోర్టు పెట్టాలన్నారు. అంతేకాకుండా ఎఫ్‌టిఎల్, బఫర్‌లో అక్రమ నిర్మాణాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టాలని సూచించారు. అన్నిచెరువుల చుట్టూ ఫెన్సింగ్ ,వాకింగ్ ట్రాక్, సివరేజ్ మళ్లింపు, సిసికెమెరాలు, వీధిదీపాలు, సెక్యూరిటీ గార్డుల ఏర్పాటుకు అంచనా ప్రతిపాదనలు 15రోజుల్లో ఇవ్వాలని లేక్స్ అధికారులకు ఆదేశించారు. జోనల్ స్థాయిలో ఒకొక్క చెరువును పరిశీలించి రివ్యూ చేయాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. అలాగే నిర్మాణ వ్యర్థాలను చెరువులల్లో డంప్ చేస్తున్న వారిని గుర్తించి ఈవిడిఎం డైరెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతోపాటు ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేయాలని , అంతేకాకుండా బఫర్ జోన్‌లో నిర్మించే భవనాలు ఉన్న పక్షంలో నోటీసులు జారీ చేయాలన్నారు. ఈసమావేశంలో ఈవిడిఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, సునంద, జోనల్ కమిషనర్లు హేమంత్ బోర్కడే, స్నేహ శభరీష్, అభిలాష అభినవ్, రవికిరణ్, వెంకన్న, ప్రాజెక్టు లేక్స్ సిఈ దేవానంద్, ఎస్‌ఈ ఆనంద్, ఈఈలు, ఛీఫ్ ఎంటమాలజీ డా.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## హాషీష్ ఆయిల్‌ను పట్టుకున్న ఎస్ఓటి పోలీసులు

### రూ. 3,36000 విలువగల హాషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు



నిందితుడు జీవన్

జీడిమెట్ల, మార్చి 22, ప్రభాతవార్త: సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కైసర్ నగర్ ప్రాంతంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 672 ఎం.ఎల్ హాషీష్ ఆయిల్‌ను ఆటో డ్రైవర్ అయిన ముదుర్కొల జీవన్ (23) అనే యువకుడిని బాలానగర్ ఎస్ఓటి పోలీసులు పట్టుకుని, అతని వద్ద నుండి రూ. 3,36000 విలువగల హాషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా మూడు రోజుల ముందు అరుకు నుండి తీసుకుని రావడం జరిగిందని, దానిని చిన్న చిన్న ప్లాస్టిక్ డబ్బాలలో ఉంచి ఏరియాలోని వివిధ లేబర్ అడ్డాలలో, కాలేజీల దగ్గర అమ్మటానికి ప్లాన్ చేశాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గొల్ల కురుమలను విస్మరిస్తే బొందపెడతాం

**యాదవ కురుమల రాజ్యాధికార ఐక్యవేదిక**




సమావేశంలో మాట్లాడుతున్న క్యామమల్లేష్, బాల్‌రాజ్ యాదవ్, మేకల కృష్ణయాదవ్

హైదరాబాద్, మార్చి 22,ప్రభాతవార్త: తెలంగాణలో 18శాతం కలిగిన గొల్లకురుమలను రాజకీయ పార్టీలు దగా చేస్తున్నాయని యాదవ కురుమల రాజ్యాధికార వేదిక ఆరోపించింది. తమ ఓట్లతో అధికారం చేపట్టి పదవులు విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడింది. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో "మేమెంతో. మాకంతా.."నినాదంతో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ సింహాద్రియాదవ్, ప్రొఫెసర్ బీనవేని రామయాదవ్, క్యామమల్లేష్, దూదిమెట్ల బాలరాజు యాదవ్ హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో గొల్లకురుమల మద్దతుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు పదవుల విషయంలో మాత్రం గాలికొదిలేసిందని విమర్శించారు. లోక్‌సభ సీట్లతోపాటు నామినేటేడ్ పదవుల్లో గొల్లకురుమలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆల్‌ఇండియా యాదవ మహాసభ ప్రతనిధులు రమేష్ యాదవ్, మేలకృష్ణ యాదవ్, నాగరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కులగణన ప్రక్రియ తక్షణమే ప్రారంభించాలి



బుర్రా వెంకటేశంను కలిసిన జాతీయ బిసి దళ్ అధ్యక్షుడు కుమారస్వామి బృందం

నాంపల్లి, మార్చి 22 ప్రభాతవార్త : లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలుకు ముందే జీఓఎంఎస్ నంబరు 26 ద్వారా ప్రభుత్వం కులగణన చేపడుతున్నట్లు ప్రకటించినందున ఈ ప్రక్రియను ప్రారంభించాలని జాతీయ బిసి దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కోరారు. ఈ మేరకు ఆయన నాయకత్వంలో శుక్రవారం ప్రతినిధి బృందం బిసి సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంను ఆయన కార్యాలయంలో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. బలహీనవర్గాలు దశాబ్ధాలుగా తమ వాటా తమకు ఇవ్వాలని కోరుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక ఆర్థిక కులగణణకు నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు జారీచేయడం హర్షదాయకమన్నారు. కులగణనకు ముందు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించడానికి సమగ్ర ప్రశ్నావళి రూపకల్పన చేయాలని, నియమనిబంధనలతో కరదీపికను రూపొందించి ఎన్యూమరేటర్లకు తగుశిక్షణ ఇస్తే సర్వేకు మార్గం సులువవుతుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్య కార్యదర్శి భేటీ అయిన వారిలో డా. మహేంద్రబాబు, శ్రీనివాస్, సుందర్, రాజేందర్ తదితరులున్నారు.

## నేడు మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం సమావేశం

అల్వాల్, మార్చి 22 ప్రభాతవార్త: మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం మల్కాజిగిరిలో జరగనున్నది. పార్లవమెంట్ ఎన్నికలు నేపథ్యంలో సమావేశంలో పార్టీ అధినాయకత్వం పార్టీ శ్రేణులకు దిశానిర్ధేశం చేస్తారని అల్వాల్ డి బ్లాక్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి తెలిపారు. లక్ష్మీసాయి గార్డెన్స్‌లో జరిగే సమావేశానికి ఎంపి అభ్యర్ధితో పాటుగా మాజీ శాసనసభ్యుడు మైనంపల్లి హనుమంతరావు పార్టీ పర్యవేక్షకులు హాజరవుతారని తెలిపారు. నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశానికి తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు సిఎలల్ యాదగిరి, బొబ్బిలి సురేందర్ రెడ్డి, రాజసింహారెడ్డి, చిట్టిబాబు, లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణగౌడ్, భాస్కర్, శ్రీనివాస్ గౌడ్, సూర్యకిరణ్, బల్వంత్ రెడ్డి, దేవేందర్, శకుంతలా నాయుడు, బబిత, గాయత్రి, లక్ష్మీ, కామేశ్వరి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి, మార్చి 22 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం యోచన స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత జానకీ సుధాకర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం అరవింద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పేదలకు సేవ చేయడంలో ముందుండాలన్నారు. ఈ సందర్భంగా పేదలకు బట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు శీలం సత్యనారాయణ, గుర్రం శంకర్, జి.జయేందర్‌బాబు, గుండు జగదీశ్, జి.సురేందర్, బి.యాదగిరిగౌడ్, అభిషేక్ కెన్నడి, బిబ్జీ, సురేందర్, దినేష్, సుబ్బారావు, ఎంకటగోవిందరావు, బాలకుమార్, భాస్కర్‌రెడ్డి, డిహెచ్. మధుమతి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలి

**టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం**



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం శ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 22, ప్రభాత వార్త: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పిలుపునిచ్చారు. శుక్రవారం మల్కాజగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని గన్‌పార్క్ ఏరియాలోని జయలక్ష్మీ గార్డెన్స్‌లో జరిగింది. మేడ్చల్ మల్కాజగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అధ్యక్షతన, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ, రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జీలు మైనంపల్లి హన్మంతరావు, బండి రమేష్, తోటకూర వజ్రేష్‌యాదవ్, కొలన్ హన్మంత్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, వెన్నెల, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నర్సా రెడ్డి భూపతిరెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి సత్యంశ్రీరంగం, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీటి వినియోగం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలి

**ప్రొఫెసర్ రాజ్‌కుమార్**



అవగాహనా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ రాజ్‌కుమార్

హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త: నీటి సంరక్షణ, వినియోగం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అంబర్‌పేటలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో జరిగిన నీటి దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ శిక్షణ పొందే అభ్యర్ధులకు నీటి ప్రాధాన్యతను వివరించారు. యునైటెడ్ నేషన్స్ ఈ సంవత్సరంను పీస్ ఫర్ వాటర్‌గా ప్రకటించారని తెలిపారు. నీటి లభ్యత, వినియోగాలు, ప్రాముఖ్యత తదతర అంశాలను ఆయన వివరించారు. పీటీసీ ప్రిన్స్‌పాల్, ఎస్‌పి మధుకర్ మాట్లాడుతూ నీటి ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. నేడు సంరక్షణకు మనం ప్రాధాన్యత ఇస్తేనే భవిష్యత్తులో నీటి సమస్యలు ఎదురవకుండా ఉంటాయని, నీటి అవసరాలు తీరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మీకుమారి, డీఎస్‌పీలు పిచ్చయ్య, విజయకుమార్, ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## నీరు లేనిదే జీవం లేదు

**తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

ముషీరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త: నీరు లేనిదే ప్రాణి కోటికి జీవం లేదని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ విద్యార్థులకు నీటి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో కొన్ని కోట్ల మంది త్రాగడానికి నీరు లేక దాహంతో అల్లాడిపోతుంటే మనం ఉన్న నీటిని వృధాగా నేల పాలు చేస్తున్నామని అన్నారు. నీటి వనరులలో చెత్తా చెదారం కలిపి త్రాగడానికి పనికిరాకుండా చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శివుడు గంగను తలపై పెట్టుకుని నీరు పూజించవలసినదని సమస్త మానవాళికి సందేశం ఇస్తున్నారని గుర్తు చేశారు. మన భూమండలంపై లభించే నీటిలో 97శాతం సముద్రపు నీరేనని, మిగతా దానిలో మంచగడ్డలు, హిమపాతం పోగా మనకు మిగిలే నీరు కేవలం 0.008 శాతం మాత్రమేనని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం అధిక శాతం నీటి సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నారని అన్నారు. మనిషి ఆహారం లేకుండా కొన్ని వారాలు ఉండగలడు కానీ నీరు లేకుండా మాత్రం కొన్ని గంటలు మాత్రమే ఉండగలడని తెలిపారు. నీటిని వృధా చేయటం సృష్టికి వ్యతిరేకమని, నిటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

## కేజ్రీవాల్ అరెస్టు రాజకీయ కక్షలో భాగమే

**ఎం.కోదండరామ్**

సైఫాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ పాఠశాలలను బాగుచేసిన ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌ను రాజకీయ కక్షలో భాగంగా అరెస్టు చేశారని, కాని గుజరాత్‌లో నేరాలు చేసిన వారిని మాత్రం నిర్ధోషులుగా క్షమాభిక్ష పెడుతున్నారని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఆరోపించారు. ఇలాంటి ఘటనలు దేశవ్యాప్తంగా జరగడం దారుణమన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'ఉద్యమ ఆకాంక్షలు–విద్యా ప్రమాణాలు–ప్రభుత్వ కర్తవ్యాలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందని కోదండరామ్ చెప్పారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బిజెపి విద్యారంగంపైన దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. విద్యను అభివృద్ధి చేస్తే సామాన్యులు ప్రశ్నిస్తారనే భయంతోనే పాలకులు దాడులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. యుజిసి విద్యకు ప్రతి ఏడాది ఆరు వేల కోట్లు కేటాయించేదని, దీన్ని రెండు వేల కోట్లకు తగ్గించిందని ఆరోపించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు, కోండా నాగేశ్వర్‌రావు, రాందాస్, వెంకట్‌రెడ్డి, రమణ, ఉపేందర్, అంబటి నాగయ్య పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ ఎం.కోదండరామ్.చిత్రంలో హరగోపాల్, విశ్వేశ్వరావు తదితరులు

## కవులు, రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలి

**వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్**

చిక్కడపల్లి, మార్చి 22 ప్రభాతవార్త: కవులు తమ కవిత్వం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. 'ప్రపంచ కవితా దినోత్సవం' సందర్భంగా శుక్రవారం భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, విమలసాహితీ సమితి సంయుక్త ఆధ్వర్యంలో 'కవిసమ్మేళనం' ప్రముఖ కవి, కళారత్న డాక్టర్ బిక్కికృష్ణ అధ్యక్షతన జరిగిందది. కళాభారతి కల్చరల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి, సాహితీవేత్త, పూర్వ మైన్స్ డైరెక్టర్ డాక్టర్ వి.డి.రాజగోపాల్ రాసిన 'అక్షరాలు అవే–భావాలు ఎన్నో' కవితా సంపుటిపై ప్రసంగించారు. వీడి.రాజగోపాల్ సామాజిక ప్రయోజనం కోసం కవిత్వం రాశారని వక్తలు కొనియాడారు. వస్తువైవిధ్యం, శిల్పసోయగంతో ఆయన కవితలు రాశారన్నారు. ఈ సందర్భంగా కవయిత్రి పద్మశ్రీలత నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో అనేక మంది కవులు పాల్గొని తమ కవితలు వినిపించారు. అతిథులు ప్రముఖ కవులు డాక్టర్ నాళేశ్వరం శంకరం, విమలసాహితీ సమితి అధినేత డాక్టర్ జెల్ది విద్యాధరరావు, ప్రముఖ గజల్ రచయిత్రి రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, పి.శ్రీనివాస్‌గౌడ్, దామోదరాచారి తదితరులు పాల్గొన్నారు. కవిసమ్మేళనంలో కవులు తమ అమూల్యమైన రచనలను ప్రస్తావించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా 30 మంది కవులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్, బిక్కి కృష్ణ, జెల్ది విద్యాధరరావు

## చేవెళ్ళ పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి అభినందనల వెల్లువ



కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 22, ప్రభాతవార్త: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా రంజిత్‌రెడ్డిని ప్రకటించిన సందర్భంగా శుక్రవారం పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్‌కు చెందిన బిఆర్ఎస్ పార్టీ యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్మగళ్ళ మోజెస్‌లు రంజిత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


## నాచారం మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం



నాచారం మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షులుగా పాదం వెంకటేష్

నాచారం, మార్చి 22 ప్రభాతవార్త : నాచారం మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షులుగా పాదం వెంకటేష్,ప్రధాన కార్యదర్శిగా ఆలూరి మహేందర్, కార్యదర్శులుగా దర్శనాల వెంకటేశ్వర్లు, ఆరాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కాలగాని నర్సింహ్మా, ననుదాల శ్రీనివాస్, రాజా రెడ్డి, గోపి శెట్టి వెంకటేశ్వర్ రావు, కోషాధికారిగా సగ్గ యాదగిరి, కార్యవర్గ సభ్యులుగా కంబం శ్రీకాంత్, జి.రేవంత్, అనిల్ కుమార్, సాగనేని సదానందం, ఎస్.శ్రీనివాస్, జారత్ నారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మూల వెంకటేశ్, ఆలూరి శ్రీనివాస్, జాపత్ సంపత్ తధితరులును ఎన్నుకున్నారు. కాగా ఈ ఎన్నికలు ముఖ్య సలహాదారులు మీసాల చంద్రయ్య, సలహాదారులు జల్లి భూపాల్, శ్రీహరి, తోట ముత్యాలుతో పాటు కుల సభ్యుల సమక్షంలో ఎన్నికలను నిర్వహించినట్లు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

**ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి బట్టర్ మిల్క్,గ్లూకోన్‌డీ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఏసీపీ శంకర్ రాజ్**



కంటోన్మెంట్,మార్చి 22 ప్రభాతవార్త: వేసవిలో ట్రాఫిక్ పోలీస్‌లు ఢీ హైడ్రేషన్‌కు గురికుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజ్ సూచించారు. సిటీ కమిషనర్ సుబ్బరాయుడు, డిసిపి 1 ఆదేశాల మేరకు శుక్రవారం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్‌లకు బట్టర్ మిల్క్,గ్లూకోన్‌డీ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌లు వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. అదే విధంగా ట్రాఫిక్ పోలీస్‌లకు కిట్ బ్యాగ్‌లు, గ్లాసెస్, షుస్, వాటర్ బాటిల్స్ అందజేస్తామన్నారు. తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధు బాబు పాల్గొన్నారు.

## నీటి ప్రాముఖ్యతకు నీటి దినోత్సవం




గాయత్రి నగర్‌లో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఇంకుడు గుంతల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న డీజిఎం రవి

యూసుఫ్ గూడ, మార్చి 22, ప్రభాతవార్త : ప్రపంచంలో అతిముఖ్యమైన వనరులలో నీరు ఒకటి అనీ అంతటి ప్రాముఖ్యం కలిగిన నీటి విలువ గురించి తెలియజెప్పేందుకు ప్రతి సంవత్సరం ప్రపంచ నీటి దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని డీజియమ్ రవి అన్నారు. శుక్రవారం ప్రపంచనీటి దినోత్సవం(శాంతి కోసం నీరు) కార్యక్రమంలో భాగంగా గాయత్రినగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జలమండలి సిబ్బందితో పాటు స్థానికంగా ప్రజలు పాల్గొన్నారు. ఈదినోత్సవం ప్రధాన ఉద్దేశం ఐక్యరాజ్య సమితి 1992లో మొదటి సారి నీటి దినోత్సవం ప్రారంభించిందని అప్పటినుంచి ప్రతి సంవత్సరం భిన్నమైన టీమ్‌తో నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారిందన్నారు. నీటి దినోత్సవాన్ని జరుపుకోవడం వలన ప్రజల దృష్టి ఆకర్షించి వారికి నీటి ప్రాముఖ్యం విలువల గురించి అవగాహన వస్తుందన్నారు. నీటిని ఆదా చేయడం అందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా బస్తీల కాలనీలలో నివాసాలు ఏర్పాటుచేసుకునే వాళ్ళు ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎన్‌జీవోస్ కోటేశ్వరరావు, రమేష్, మానేజర్ విలియం ప్రకాష్, వర్క్ఇన్స్‌పెక్టర్‌లు మొగలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భూపరిరక్షణ పై ప్రతి విద్యార్థిలో పూర్తి అవగాహణ కలిగించాలి: డైరెక్టర్ సుబ్బారావు




ఎర్త్‌అవర్ ద్వారా భూసారాన్ని రక్షించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పాఠశాల నిర్వాహకులు సుబ్బారావు, డైరెక్టర్ డాక్టర్.గొల్లపూడి వీరేంద్రచౌదరి

కుత్బుల్లాపూర్, మార్చి22 ప్రభాత వార్త: పర్యావరణ పరిరక్షణకు ప్రతియేటా నిర్వహించే ఎర్త్ అవర్ ప్రాధాన్యతను చిన్నప్పటి నుండే విద్యార్థుల్లో పూర్తి అవగాహణ కల్పించాలని చింతల్ త్రివేణి హైస్కూల్ నిర్వాహకులు సుబ్బారావు అన్నారు. శుక్రవారం చింతల్ త్రివేణి హైస్కూల్ విద్యార్థులకు ఎర్త్‌అవర్ ప్రాధాన్యతను వివరిస్తూ ప్రతిజ్ఞచేయిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో సుమారు 190 దేశాల ప్రజలు ఎర్త్‌అవర్ సందర్భాన్ని పురస్కరించుకుని విద్యుత్ పరికరాల ఉపయోగాన్ని రాత్రి 8.30నుండి 9.30వరకు విద్యుత్ దీపాలను ఆర్పివేస్తారని సూచించారు. ప్రకృతిని కాపాడుకునే దిశగా విద్యార్థుల్లో మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించాలని అన్నారు. ప్రతి సంవత్సరం మార్చిలో ఆఖరి శనివారం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంగా గుర్తింపు పొందిందన్నారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ భూమిని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా ఎర్త్‌అవర్‌ను పాటించాలని సూచించారు. సమావేశంలో సుబ్బారావు, వెంకటరావు, నళినిలతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గొల్ల, కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందచేస్తున్న ఎమ్మెల్సీ, కురుమసంఘం రాష్ట్ర అధ్యక్షులు యెగ్గెమల్లేశం, ప్రభుత్వవిఫ్ బీర్ల ఐలయ్యలు

బేగంబజార్, మార్చి 22 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో గొల్ల,కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు,ఎమ్మెల్సీ యెగ్గేమల్లేశం, ప్రభుత్వవిఫ్ బీర్లఐలయ్యలు ముఖ్యమంత్రిఎ.రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు.కురులకు ప్రత్యేక ఏర్పాటుకు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కురులమ బిసి(బి)11అలాగే యాదవులు బిసి.డి.33లో వస్తారని, రాష్ట్రంలో యాదవులతో పొల్చుకుంటే కురుమలు,అధిక సంఖ్యలో ఉంటారన్నారు.కురుమలో సామాజికంగా,రాజకీయ, విద్యాపరంగా వెనుకబడి ఉన్నట్లు తెలిపారు.కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ చేసి కురుమల అభివృద్ధికి తొడ్పడాలని,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించినట్లు చెప్పారు.కోకాపేట్‌లో నిర్మిస్తున్న దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవనానికి మిగిలి పోయిన పనులను పూర్తి చేయాలని కోరారు.భవనానికి రాక్‌కట్టింగ్, కాంపౌండ్‌వాల్‌లకు నిధులు విడుదల చేసి భవనాన్ని ప్రారంభించాలని కోరారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సంక్షేమానికి కేంద్రం 5 వేల కోట్లు కేటాయించాలి

సైఫాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా ఉన్న న్యాయవాదుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 5 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 200 కోట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల జెఎసి డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి 100 కోట్లు కేటాయిస్తామని ప్రకటించి, ఇంతవరకు నిధులు అందించలేదని జెఎసి ఆరోపించింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్‌యాదవ్, కన్వీనర్ బాతుల కృష్ణ, కో–కన్వీనర్ మంజుల మాధారం మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం న్యాయవాదులకు తీరని అన్యాయం చేసిందని, న్యాయవాదులకు రక్షణలేదని, ప్రభుత్వ సహకారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మీడియ కో–ఆర్డినేటర్ వెంకటేష్, సభ్యుడు ఎస్.కె.జావీద్‌ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**కార్పొరేటర్ మండగిరి స్వామియాదవ్**



మెహిదీపట్నం, మార్చి 22, ప్రభాతవార్త : అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్వాన్ డివిజన్ కార్పొరేటర్ మండగిరి స్వామియాదవ్ అన్నారు. డివిజన్ అభివృద్ధి కోసం కోట్లాది నిధులను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని హీరానగర్, అల్లూరి సీతారామరాజు నగర్, సాయినగర్ బస్తీలలో రూ.6కోట్ల నిధులతో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు గోద వెంకటేష్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామి యాదవ్ మాట్లాడుతూ... కార్వాన్ డివిజన్ అభివృద్ధి మజ్లిస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. బస్తీలలోని అంతర్గత రహదారులతో పాటు భూగర్భ డ్రైనేజీ ఆయన వెంట బస్తీవాసులు సంతోష్‌సింగ్, నాగరాజు, శ్రీనివాస్, వడ్డెరి రాజు, వడ్డెరి శ్రీనివాస్‌లు ఉన్నారు.

## వివాహిత ఆత్మహత్య

అల్వాల్, మార్చి 22 ప్రభాతవార్త: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ ఎంహెచ్‌ఆర్ కాలనీలో భార్య భర్తలు కవిత రెడ్డి(28), మదుసూధన్ రెడ్డిలు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కవిత రెడ్డి కిమ్స్ ఆసుపత్రిలో పని చేస్తోంది. రెండు రోజులు క్రితం బాధితురాలి భర్త తన తల్లి అనారోగ్యంతో ఉన్న నేపథ్యంలో ఆమెను చూసుకోవడానికి స్వస్థలం సిద్దిపేట్‌కు వెళ్ళాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న కవిత రెడ్డి బెడ్‌రూములో ఉరి వేసుకుని ఉండడాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ తెలిపారు.

## ఇన్నాళ్లు సహకరించిన అధికారులు, సభ్యులకు ధన్యావాదాలు

**మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్**



నార్సింగి, మార్చి 22 ప్రభాతవార్త : గత నాలుగున్నరేళ్ల నుంచి నాకు సహకరించిన అధికారులు, పాలకవర్గ సభ్యులు, ప్రజలందరికి ధన్యావాదాలు చెబుతున్నానని మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ తెలిపారు. గురువారం అవిశ్వాస పరీక్షలో ఓటమిపాలైన తరువాత మహేందర్‌గౌడ్ స్పందించారు. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ అభివృద్ధికి ఇన్నాళ్లు నేను తీసుకున్న నిర్ణయాలకు పూర్తి మద్దతు తెలిపిన సహచర సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. సభ్యులందరి సహకారం వల్లనే వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేశామన్నారు. పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేశామన్నారు. అన్ని వార్డులలో మంచినీటి పైప్‌లైన్‌లు, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, సీసీ రోడ్లు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, స్మశాన వాటికలు, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, కమ్యూనిటీ హాళ్లు ఇలా అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఇక ముందు కూడా కార్పొరేషన్ అభివృద్ధికి నావంతు పూర్తి సహకారం అందిస్తానని, నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి ఇబ్బందులు తెలుసుకొని, సంబంధిత శాఖల అధికారులకు తెలిపి పరిష్కరిస్తారనని మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ స్పష్టం చేశారు.

## సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రతినిధులను సన్మానిస్తున్న దృశ్యం

చార్మినార్,మార్చి 22 ప్రభాతవార్త : సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నికల పోటీ నుంచి పలువురు న్యాయవాదులు తప్పుకున్నారు.సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా డి.హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శిగా బి.రాజేష్ కుమార్,గ్రంధాలయం కార్యదర్శిగా సుదాంషు కుమార్,కోశాధికారిగా టి.విశాల్ సింగ్,క్రీడా విభాగం కార్యదర్శిగా సైదిరెడ్డిలను ఎన్నుకోవటం జరిగిందని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యదర్శి డి.హర్షవర్ధన్ తెలిపారు.కొత్తగా ఎన్నికైన సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రతినిధులను శాలువ కప్పి సన్మానించారు.

# కూరగాయల సంతతో వాహనదారుల ఇబ్బందులు

## రోడ్లపైనే పార్కింగ్ అవస్థలు పడుతున్న ప్రజలు



ఆది, సోమవారం సంతతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడుతున్న దృశ్యం

**తుర్కయంజాల్, మార్చి 22 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ చౌరస్తాలో ఆదివారం, సోమవారం ఇంజాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసే కూరగాయల సంతతో ఇబ్బందులు తప్పడంలేదని, ముఖ్యంగా తుర్కయంజాల్ చౌరస్తానుండి నాదర్ గుల్ వెళ్లే దారి ఒకటే రోడ్డు ఉంది కనుక అధికారులకు ప్రజాప్రతినిధులకు ఈ సమస్య కనిపించలేదని ప్రజలు ఆరోపణ చేస్తున్నారు. అదేవిధంగా సోమవారం సంత తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ సాగర్ హైవే చౌరస్తా నుండి హయత్ నగర్ వెళ్లే రోడ్డు మరియు తొర్రూరు కు వెళ్లే రోడ్డు ఒకటే ఉంది కనుక లారీలు కార్లు అదే రోడ్డుపై వెలవలసి ఉంటుంది కనుక రోడ్డు దాటాలంటే పక్క రెండు గంటలు పడుతుందని సంత రోజూ చిరు వ్యాపారులు తోపుడు బండ్ల వ్యాపారులు రహదారిని కబ్జా చేస్తూ దుకాణాలు ఏర్పాటు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతుంది. దీంతో తమ వ్యాపారాలు సైతం దెబ్బతింటుందని స్థానిక వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సంత మరో చోట ఏర్పాటు చేస్తే సమస్యలను పరిష్కరించవచ్చని ప్రజలు కోరుతున్నారు. యంజల్ మరియు ఇంజాపూర్ చౌరస్తాలో సెంటర్ల దుకాణాల ముందు ఇష్టం వచ్చినట్లు వాహనాలు నిలవడంతో పాదాచారులు, మహిళలు,తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డుపై వాహనాలను నిలవ కుండా చర్యలు తీసుకోవా లని ప్రజలు కోరుతున్నారు. రోడ్డు కబ్జా చేసి సంత ఏర్పాట్లు గతంలో మున్సిపాలిటీ పరిధిలో జనాభా తక్కువ ఉండడంతో సంత ఏర్పాటు చేసినా పెద్దగా తలెత్తలేదు ఇటీవలకాలంలో జనాభా పెరగడంతో పాటు మున్సిపా లిటీ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఎక్కువగా వస్తుండడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. సంతను మార్చాలని పలుమార్లు వినిపించి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఆదివారం సంతాలో జేబుదొంగలు సెల్ ఫోన్స్ పర్సు చోరీ చేస్తున్నారని ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు,స్పందించి సంతను మరోచోటికి మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

**రోడ్లపైనే విక్రయాలను నిర్వహిస్తున్న వ్యాపారులు**

దొంగలు సెల్‌ఫోన్లు, పర్సు చోరీ చేస్తున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి సంతను మరో చోటికి మార్చాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఆదివారం, సోమవారం సంతలో జేబు దొంగలు ఎక్కువయ్యారని, సంతకు వెళ్లాలంటే ప్రజలు మహిళలు భయపడుతున్నారని పేర్కొన్నారు.

**మరో ప్రాంతానికి మార్చాలి....** తుర్కయంజాల్ దారిలో రోడ్లు కబ్జాచేస్తూ ఏర్పాటు చేస్తున్న సంతను మరో ప్రాంతానికి మార్చాలి సంత కారణంగా ఆదివారం, సోమవారం ప్రజలు బయటకు రావాలంటే స్థానికులు భయ పడవలసి వస్తుంది అందరికీ అనుకూలంగా ఉన్నా చోటికి సంతను మార్చాలని సీసీ కెమెరాలు సంతలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయం : లక్ష్మినారాయణ



సిఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్న లక్ష్మినారాయణ తదితరులు

**మలక్‌పేట, మార్చి 22 ప్రభాతవార్త :** ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆర్యవైశ్య మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు అమరవాది లక్ష్మినారాయణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్య వైశ్య కార్పొఏషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో ఆయన ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో నిరుపేద ఆర్యవైశ్యులు ఎంతో రుణపడి ఉంటారని అన్నారు. నామినేటెడ్ పోస్టులలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

## మానవత్వాన్ని చాటుకున్న ఉపేందర్‌రెడ్డి




చెక్కు అందజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 22 ప్రభాతవార్త:** ఆర్కేపురంకాలనీ రోడ్డు నెంబర్ 4లో పి.శ్యామలదేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌కేవై స్పెషల్ స్కూల్ (మానసిక బుద్ధి మాంద్యం గల విద్యార్థిని, విద్యార్థులు గల స్కూల్‌కి రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుఉపేందర్‌రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి నిర్వాహకులకు రూ.25వేల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నానవాల జ్ఞానేశ్వర్‌యాదవ్, పెద్దవూర సైదులు, మాజీ సర్పంచ్ పాండు. వంగాల శ్రీకాంత్‌రెడ్డి, విజయ్, జహంగీర్, విప్లవ్, జగదీష్, శివ, స్కూల్ పర్యావేక్షకురాలు మాధవిరెడ్డి, టీచర్స్, జే.నిర్మల, యస్.వనజ, ఏ.సోనీ, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారి సేవలో తీగల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 22 ప్రభాతవార్త:** మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ నగర మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి శుక్రవారం తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, అల్మాస్‌గూడ మాజీ పోలీస్ పటేల్ చప్పిడి సంతోష్‌రెడ్డి, భాగ్యనగర్ సొసైటీ మాజీ డైరెక్టర్ కుంచ నాగేందర్‌గౌడ్ తదితరులతో కలిసి నెల్లూరు పర్యటనకు వెళ్ళిన ఆయన తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనీ మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## పదేళ్ళ తర్వాత ప్రభుత్వం రావడంతో కార్యకర్తల్లో సంతోషం: సామిడి గోపాల్‌రెడ్డి



సిఎం రేవంత్‌రెడ్డిని సన్మానించి పుష్పగుచ్ఛానిస్తున్న సామిడి గోపాల్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ళ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పార్టీ కార్యకర్తలకు గుర్తింపు లభిస్తున్నదని మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలన పూర్తయిన సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డిని జూబ్లిహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసిన గోపాల్‌రెడ్డి శాలువాతో సన్మానించి పూలబొకేను అందజేసిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వచ్చిందని తెలిపారు. అయితే మీర్‌పేట్ కార్పొరేషన్‌కు సంబంధించిన కొన్ని ముఖ్య విషయాలను ఆయన సిఎం దృష్టికి తేవడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో యువ నేత సామిడి చరణ్‌రెడ్డి, నాయకుడు దేవరపల్లి యాదిరెడ్డిలు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఛైర్మన్ చల్లాకు ఘన సన్మానం



చల్లా నర్సింహారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సరూర్‌నగర్, మార్చి 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాలు, ఆర్థిక సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలం అల్మాస్‌గూడకు చెందిన కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎపిఆర్‌ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చప్పిడి సుభాన్ రెడ్డి సమక్షంలో సరూర్‌నగర్ మాజీ జడ్పీటిసి బంగారు సత్యనారాయణ ఆధ్వ ర్యంలో చల్లా నర్సింహారెడ్డి గజమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి, మల్గారి శ్రీధర్‌రెడ్డి, రామిడి కృష్ణారెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, కె.రాజు యాదవ్, ఒగం బిక్షపతిరెడ్డి, ఏనుగు లక్ష్మారెడ్డిలతో పాటు జిల్లెలగూడ కార్పొరేటర్లు చల్లా కవితా బాల్‌రెడ్డి, సిద్దాల మౌనిక శ్రీశైలం, మాజీ ఎంపిటిసి నిమ్మల వెంకటేశ్‌గౌడ్, కర్మన్‌ఘాట్ టెంపుల్ మాజీ డైరెక్టర్ ఎరుకల వెంకటేశ్‌గౌడ్, ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి, కీసర యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాసాని ని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, మార్చి 22 ప్రభాతవార్త:** చేవెళ్ల పార్లమెంట్ బిఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం అని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్‌ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. గ్రీన్‌హిల్స్ కాలనీ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 24న మీర్‌పేట్ ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు అనుభవించి పార్టీ మారడం బాధాకరమన్నారు. వందరోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇంతవరకు రైతు బంధు ఇవ్వలేకపోయాడన్నారు. కెసిఆర్ హాయంలో వేసిన 30,000ఉద్యోగ నోటిఫికేషన్‌లను, తమ ప్రభుత్వమే నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చామనడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్,నాయకులు రామాచారి, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్ గౌడ్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, దుబ్బాక శేఖర్, జగన్, వాజిద్ పటేల్, బాలునాయక్, బుజ్జిబాయి, కల్పన, హేమ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ శాస్త్ర విద్యార్థి సమాజంలోని అసమానతలను తొలగించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మధుయాష్కీగౌడ్

**ఎల్.బి.నగర్, మార్చి 22 ప్రభాతవార్త:** న్యాయశాస్త్ర విద్యార్థి రాజ్యాంగాన్ని గౌరవించడంతోపాటు సమాజంలోని అసమానతలను అవినీతిని న్యాయ మార్గంలో ఎదుర్కోవాలని మాజీ రాజ్యసభ సభ్యుడు మధు యాష్కిగౌడ్ సూచించారు. ఆర్కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ మహాత్మాగాంధీ న్యాయ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించగా మధుయాష్కిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయశాస్త్ర అభ్యాసంలో విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించినప్పుడే తమ వృత్తిలో రాణించగలుగుతారన్నారు. ప్రస్తుత కాలంలో న్యాయశాస్త్ర విద్యార్థులకు వివిధ రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఉస్మానియా న్యాయ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జిబి.రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో న్యాయ శాస్త్రాన్ని అభ్యాసం చేయాలన్నారు. కళాశాలలో ప్రతి అంశం గురించి క్షుణ్ణంగా నేర్చుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు సాధించిన అభివృద్ధి తమ కళాశాలకు గర్వకారణం అన్నారు. మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో చదువుకున్న విద్యార్థి పివి.హరీష్ జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా ఎంపికైన సందర్భంగా అతిథులు హరీష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆటపాటలతో అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్‌వి.శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అస్తి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్




ఉప్పల్ సర్కిల్ కార్యాలయం

**ఉప్పల్, మార్చి 22 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్‌లో అస్తి పన్ను వసూలుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, చిలుకానగర్, రామంతాపూర్, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి పన్నులు వసూలు చేపట్టారు.జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి, డిసి అంజనేయులు ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలో అస్తి పన్ను వసూలు చేపట్టారు. ఉప్పల్ సర్కిల్‌లో మొత్తం 49వేల నివాస గృహాలు ఉండగా ఇప్పటి వరకు 20వేలకు పైగా నివాస గృహాల నుంచి పన్నుల వసూలు చేపట్టారు. ఈ ఏడాది మొత్తం అస్తి పన్ను లక్ష్యం మొత్తం రూ.43.10 కోట్లు ఉండగా, ఇప్పటి వరకు రూ.27.46 కోట్ల పన్నులు వసూలు అయినట్లు డిసి అంజనేయులు తెలిపారు. మిగిలిన పన్నులు ఈ నెల చివరి వరకు మిగిలిన మొత్తం పన్నులు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏడు ప్రత్యేక బృందాల ద్వారా పన్నుల వసూలు చేపట్టినట్లు డిసి అంజనేయులు తెలిపారు. గత ఏడాది రూ.34.40 కోట్ల అస్తిపన్ను వసూలు లక్ష్యం కాగా, ఈ నెల 31 వరకు మొత్తం పన్నులు వసూలు చేయాలని నిర్ణయించినట్లు డిసి తెలిపారు. అస్తి పన్ను సకాలంలో వసూలు చేసి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఇప్పటికే కరపత్రాల ద్వారి, వ్యక్తిగతంగా ప్రజలకు సమాచారం అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు సెలవు రోజుల్లో కూడా పన్నులు చెల్లించవచ్చని డిసి అంజనేయులు తెలిపారు. అస్తి పన్ను చెల్లిస్తే ప్రభుత్వం నుంచి రాయితీ వస్తుందని తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేద ప్రజలకు న్యాయం : మైనంపల్లి హన్మంతరావు



సమావేశంలో పాల్గొన్న సునితామహేందర్‌రెడ్డి, మైనంపల్లి తదితరులు

**మల్కాజిగిరి, మార్చి 22 ప్రభాతవార్త:** నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని భారీ మెజారిటీతో సునీత మహేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్వహించిన సమావేశంలో మైనంపల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేద బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతారని ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు పోతుందన్నారు. ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు పెన్షన్లు అందజేయడం జరుగుతుందన్నారు. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా సునీతమహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కంటోన్మెంట్ నాయకులు గణేష్, గద్దర్, వెన్నెల, మాజీ వైస్ ఛైర్మన్ జయప్రకాష్‌తో పాట వందలాది మంది కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## వికలాంగుల సంక్షేమానికి కృషి : ముత్తినేని



సిఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలను అందజేస్తున్న ముత్తినేని వీరయ్య

**మలక్‌పేట, మార్చి 22 ప్రభాతవార్త :** వికలాంగుల సంక్షేమానికి ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ విక లాంగుల విభాగం రాష్ట్ర ఛైర్మన్ ముత్తినేని వీరయయ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముత్తినేని వీరయ్యను వికలాంగుల సంక్షేమ శాఖ ఛైర్మన్‌గా నియ మిస్తున్నామని ప్రకటించడంతో ఆయన సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలను అందజేసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమం కోసం నిరంతరం పని చేయాలని ప్రభుత్వానికి, పార్టీకి మంచి పేరు తీసుకు రావాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించారని తెలిపారు. దివ్యాంగుల సమస్య లను పరిష్కరించి వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. అదే విధంగా పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటుచేయడం పట్ల అభినందనలు తెలిపారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

**హయత్‌నగర్, మార్చి 22 ప్రభాతవార్త:** బంజారా కాలనీలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు.గురువారం ఆయన కాలనీలో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనకు సమస్యను వివరించారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో తరుచూ మురుగునీరు మ్యాన్‌హోళ్లనుంచి పొంగిపొర్లుతోందని, దీని వల్ల దోమలు ఎక్కువై, దుర్గంధం కూడా వ్యాపిస్తోందని వివరించారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి త్వరలోనే మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

## రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా సమావేశం

**బోడుప్పల్, మార్చి 22 ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన నాయకులు కార్యకర్తల సమావేశంలో పాల్గొనడం జరిగింది. బిఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపుకై నాయకులకు కార్యకర్తలకు దిశనిర్దేశం చేసారు.

## సకల జనులు చల్లగా ఉండాలి: ఉప్పల



ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను సన్మానిస్తున్న నిర్వాహకులు

**ఎల్.బి.నగర్, మార్చి 22 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ జైపురికాలనీ శ్రీశిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ 12వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త సాయినాథుడిని దర్శనం చేసుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం నిర్వాహకులు శ్రీనివాస్‌గుప్తాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ కొలను వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొరివి జంగయ్యగుప్తా, కోశాధికారి రావుల రంజిత్‌గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షుడు గుణగంటి రాములుగౌడ్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మినగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 22 ప్రభాతవార్త :** ఉప్పల్ లక్ష్మినగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ లక్ష్మినగర్ కాలనీలో పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, కొత్త డ్రైనేజీ లైన్లు వేయడంతోపాటు, ప్రజలకు ఇబ్బంది లేకుండా పైప్‌లైన్ల నిర్మాణం చేపడుతామని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజల సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో పర్యటించి కాలనీవాసులతో ముఖాముఖి బేటి అయ్యారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నేతలు ఆకుల మహేందర్, అన్న బాలకృష్ణ, సుక్క కిరణ్, అల్వాల నాగరాజు, నిరంజన్‌చారి, కాలనీ సంఘం నేతలు పాయసం గోపాల్, బొడ్డు రవీందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఓజోన్ ఆస్పత్రికి రేడియో సిటీ అవార్డు




దీప్తికి అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

**ఎల్.బి.నగర్, మార్చి 22 ప్రభాతవార్త:** హైటెక్స్ హెచ్‌ఐసియు నోవాటెల్ హోటల్‌లో రేడియో సిటీ నిర్వహించిన హైదరాబాద్ ఐకాన్ అవార్డ్స్ కార్యక్రమంలో బెస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కేటగిరీలో ఓజోన్ హాస్పిటల్ అవార్డును కైవసం చేసుకుంది. హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి చేతుల మీదుగా ఓజోన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ దీప్తిసాయిప్రసాద్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓజోన్ హాస్పిటల్స్ ఛైర్మన్ బివి.సత్యసాయిప్రసాద్, ఛీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస రావు, డైరెక్టర్ వై.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హనుమాన్ చిత్ర దర్శకుడు ప్రశాంత్‌వర్మ, సినిమా హీరో తేజ, నటుడు శివబాలాజీ, పలువురు సినీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.


## వడ్డెర వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి : వడ్డెర సంఘం



జైపాల్‌ను సన్మానిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

**తుర్కయాంజాల్, మార్చి 22 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంబిసి కార్పొరేషన్ ఛైర్మన్‌గా జరుపట్టీ జైపాల్‌ను నియమించడం పట్ల వడ్డెర వృత్తిదారుల సంఘం హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంబిసి ఛైర్మన్ జరుపట్టీ జైపాల్‌ను వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డెర వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకపోవాలని కోరారు. వడ్డెర వృత్తిదారుల హక్కులైన గుట్టలు, క్వారీలపై పూర్తి హక్కుల కోసం, 10 లక్షల భీమా కోసం కృషి చేయాలని కోరారు. వడ్డెర కార్పొరేషన్ కొరకు, నిధుల మంజూరు కై కృషి చేయాలని కోరారు. కాంట్రాక్టు పనుల్లో 30 శాతం రిజర్వేషన్లు కోసం, ఎలాంటి ఇఎండి లేకుండా కాంట్రాక్టు పనుల్లో 5 కోట్ల రూపాయల వరకు పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుంచం వెంకటకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్, రాష్ట్ర గౌరవ సలహాదారులు రూపని లోకనాథం, రాష్ట్ర నాయకులు ఇడగొట్టి ఒడ్డన్న, కోమ్మరాజుల శ్రీనివాస్, నర్ర పాండు, నాయకులు వేముల మల్లేష్, వడ్డెర సంఘం రాష్ట్ర కన్వీనర్ గోగుల పాంచన్ శ్రీను, క్షౌరవృత్తి దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మనోహర్‌రెడ్డి, సత్తయ్యకు మర్రి అభినందనలు



మనోహర్‌రెడ్డి, కొత్తకుర్మ సత్తయ్యలను అభినందించిన మర్రి నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 22 ప్రభాతవార్త:** డిసిసిబిగా ఛైర్మన్‌గా ఉంటూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి ఎమ్మెల్యేగా గెలిచిన మనోహర్‌రెడ్డిని అదే విధంగా డిసిసిబి నూతన ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తుర్కయాంజాల్ సొసైటీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యలను భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి అభినందించారు. రాజేంద్రనగర్‌లో శుక్రవారం జరిగిన డిసిసిబి సర్వసభ్య సమావేశానికి హాజరైన నర్సింహారెడ్డి వారిని మర్యాదపూర్వకంగా కలిసి తోటి సొసైటీ ఛైర్మన్లతో కలిసి అభినందనలు తెలిపారు.



మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కోటగిరి శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో శ్రీనివాస్‌గౌడ్‌కు ఏఐసిసి వ్యవహారాల ఇంచార్జ్ దీపా దాస్ మున్షి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం. (ప్రభాతవార్త, సైదాబాద్)